సాక్షి
పల్నాడు
మంగళవారం । 30 । ఏప్రిల్ । 2024





పొన్నూరు ఐలాండ్ సెంటర్‌లో బస్సుకు ఎదురేగి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి స్వాగతం పలుకుతున్న జనసందోహం

సాయంత్రం 4:39 గంటలకు ..
గుంటూరు జిల్లా పొన్నూరులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం





ప్రణమిల్లిన పొన్నూరు

మేనిఫెస్టో ప్రకటించాక తొలిసారి పొన్నూరు విచ్చేసిన సీఎం వైఎస్ జగన్‌కు బ్రహ్మరథం పట్టిన ప్రజలు

- 42 డిగ్రీల ఉష్ణోగ్రతలో సైతం తరలివచ్చిన జనసందోహం
- అంచనాకు మించి ప్రజలు రావడంతో కిటకిటలాడిన పొన్నూరు పట్టణం
- మోసపూరిత పాలనకు, సుపరిపాలనకు తేడా చూడాలన్న జగన్
- 175 అసెంబ్లీ, 25 పార్లమెంటు స్థానాలను గెలిపించేందుకు సిద్ధమేనా అన్న పిలుపునకు 'సిద్ధం సిద్ధం' అంటూ ప్రతిస్పందించిన జనసందోహం
- మురళన్న మంచివాడు...రోశయ్య అన్న సౌమ్యుడు అంటూ అభ్యర్థులను సభకు పరిచయం చేసిన ముఖ్యమంత్రి
- రెండు ఓట్లూ ఫ్యాన్ గుర్తుపై వేసి ఇద్దరినీ గెలిపించాలని పిలుపు

ఎన్నికల మేనిఫెస్టో ప్రకటన అనంతరం తొలిసారి జిల్లాకు వచ్చిన
సీఎం వైఎస్ జగన్‌కు పొన్నూరు ప్రజలు పట్టాభిషేకం చేశారు....
పేదల కన్నీళ్లు తుడిచేలా.. పండుటాకులకు నిండు భరోసా నిచ్చేలా..
అక్క చెల్లెమ్మలకు మరింత ఆర్థిక ఆసరా కల్పించేలా..
చిన్నారులు, యువత భవిష్యత్‌కు బంగారు బాటలు వేసేలా..
పేదలకు మరింత మేలు చేసేలా.. సంక్షేమ జెండా సగర్వంగా ఎగిరేలా..
ప్రజల ఆకాంక్షలు ప్రతిబింబించేలా..జనత కలలు సాకారం చేసేలా
రూపొందించిన మేనిఫెస్టోకు పెద్దఎత్తున తరలివచ్చిన జనసందోహం
తమ హర్షధ్వానాలతో ఆమోదం తెలిపింది.
ఐదేళ్లలో జన బతుకులు మార్చి..సంక్షేమాభివృద్ధితో అండగా నిలిచిన
జగనన్న వెంటే ఉంటామని ప్రతిన బూనారు..
బూటకపు వాగ్దానాలకు మోసపోమని.. ఇప్పటికీ.. ఎప్పటికీ
మా నమ్మకం నువ్వే జగన్ అంటూ ప్రణమిల్లారు.





గుంటూరు లోక్‌సభ అభ్యర్థి కిలారి వెంకటరోశయ్య, పొన్నూరు అసెంబ్లీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణలను సభకు పరిచయం చేస్తున్న సీఎం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: పొన్నూరు జనసంద్రమైంది. 42 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు అయినా తమ నేతపైన ఉన్న అభిమానంతో ఎండను లెక్క చేయలేదు. అభిమానం ముందు సూరీడు చిన్నబోయాడు. మధ్యాహ్నం మూడు గంటలకు సభ అని ప్రకటించినా ఉదయం నుంచే నియోజకవర్గం నలు మూలల నుంచి అభిమానులు తరలివచ్చారు. ముఖ్యమంత్రి ప్రసంగిస్తున్నంత సేపు అభిమానుల కేరింతలతో పొన్నూరు మార్మోగింది. సెంటర్ నిండిపోవడంతో అభిమానులు భవనాలపైకి ఎక్కి సీఎం ప్రసంగాన్ని విన్నారు. తీన్మార్ డప్పులతో వివిధ వార్డుల నుంచి పార్టీ కార్యకర్తలు ఊరేగింపుగా తరలి వచ్చారు. కల్లుగీత కార్మికులు తాటిచెట్టును ట్రాక్టర్‌కు కట్టి ఊరేగింపుగా వచ్చారు. వైఎస్సార్ సీపీ జెండాలు రెపరెపలాడాయి. హెలిప్యాడ్ నుంచి పొన్నూరు అంబేద్కర్ సెంటర్ వరకూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అభివాదం చేస్తూ రోడ్‌షో నిర్వహించారు. జై జగన్ నినాదాలతో శ్రేణులు హెలిప్యాడ్ నుంచి సభ జరిగే ప్రాంతం వరకూ కాన్వాయ్ వెంట జనం పరుగులు తీశారు.



వైఎస్సార్ సీపీ గుర్తు ఫ్యాన్‌ను చూపుతున్న సీఎం

58 నెలల సుపరిపాలన..

పొన్నూరు నియోజకవర్గ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో అశేష అభిమానసంద్రాన్ని ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడారు. 14 సంవత్సరాల మోసపూరిత పాలనకు, 58 నెలల సుపరిపాలనకు తేడా చూడాలని జగన్‌మోహన్‌రెడ్డి కోరారు. చంద్రబాబు నన్ను బచ్చా అంటున్నాడు, నేను బచ్చానే అయితే 14 సంవత్సరాల తన పాలనలో చేసిన మంచిని చూపించి ఓటు అడగడం మానేసి నన్ను తిట్టడమే పనిగా ఎందుకు పెట్టుకున్నాడని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. 58 నెలల జగన్ పాలనకు భయపడి రాష్ట్రంలోని అన్ని పార్టీలతో పొత్తు పెట్టుకున్నాడని జగన్ చెప్పినప్పుడు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ గెలవాల్సిందే. తగ్గదే లేదు సిద్ధమేనా అని జగన్ ప్రశ్నించినప్పుడు జనం సిద్ధమే అని నినాదాలు చేశారు. 'ఫ్యాన్ ఇంట్లో ఉండాలి? చెడు చేసిన సైకిల్ వీధిలో ఉండాలి. తాగేసిన గ్లాస్ సింక్‌లో ఉండాలి' అన్నప్పుడు జనం అవును.. అవును అంటూ పెద్ద ఎత్తున స్పందించారు.

మురళీ అన్న మంచివాడు..

పొన్నూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మురళన్న(అంబటి మురళీకృష్ణ) మంచివాడు, సౌమ్యుడు. మీకు మంచి చేస్తారన్న నమ్మకం, విశ్వాసం ఉంది. పార్లమెంట్ అభ్యర్థిగా రోశయ్య అన్న పోటీ చేస్తున్నాడు. మంచి వాడు సౌమ్యుడు, మాటలు కొంచం కటువుగా అనిపించినా మనస్సు వెన్న. మీ చల్లని దీవెనలు, ఆశీస్సులు రోశయ్య, మురళీలపై ఉంచాలని కోరారు.



వైఎస్సార్ సీపీ జెండాతో చిన్నారి

చంద్రబాబు మోసాల నిగ్గదీతపై విశేష స్పందన..

2014లో ఇంటింటికి చంద్రబాబు నాయుడు సంతకం చేసి పంపిన పాంప్లేట్‌లో ముఖ్యమైన హామీ రైతు రుణమాఫీ అంటూ మొదటి సంతకం చేస్తానన్నాడు. రూ. 87,612 కోట్లు రుణ మాఫీ జరిగిందా అని అడుగుతా ఉన్నా అన్నప్పుడు జనం లేదు.. లేదు.. అని పెద్దపెట్టున నినదించారు. ఇదే చంద్రబాబు నాయుడు సంతకం పెట్టి ఆయన చేసిన రెండో హామీ పొదుపు సంఘాల రుణాలన్ని రద్దు చేస్తానన్నాడు. మరి రూ. 14,205 కోట్లు పొదుపు సంఘాలకు సంబంధించిన రుణాలు, ఇందులో ఒక్క రూపాయి అయినా మాఫీ చేశాడా అని అన్నప్పుడు లేదు.. లేదు అంటూ జనం నినదించారు. మూడో హామీ అంటూ ఆడబిడ్డ పుడితే మహాలక్ష్మి పథకం కింద రూ. 25వేలు బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తామన్నాడు. కనీసం ఒక్క రూపాయి అయినా చేశాడా అని అన్నప్పుడు అస్సలు లేదు.. లేదు అంటూ చేతులు ఊపుతూ మరీ జనం ప్రతిస్పందించారు. ఇంటింటికి ఉద్యోగం.. ఉద్యోగం ఇవ్వలేకపోతే నెలనెలా రూ.2వేలు నిరుద్యోగ భృతి అని ఈ పెద్ద మనిషి చెప్పాడు. ఐదు సంవత్సరాలు అంటే 60 నెలలకు.. నెలకు రూ. 2వేలు అంటే ప్రతి ఇంటికి రూ. 1.20 లక్షలు ఇచ్చాడా అని అడుగుతా ఉన్నాను.. అంటూ చంద్రబాబు మోసాల గురించి ప్రశ్నించినప్పుడల్లా జనం తమ రెండుచేతులను అడ్డంగా ఊపుతూ చంద్రబాబు మోసం చేశాడంటూ కేకలు పెట్టారు. ప్రతి నగరంలో హైటెక్ సిటీ నిర్మిస్తానన్నాడు, మీ పొన్నూరులో కనిపించిందా.. అన్ని ప్రశ్నించగా జనం లేదంటూ చేతులూపారు.

పొన్నూరు.. సిద్ధమా..

పొన్నూరు సిద్ధమా అంటూ ముఖ్యమంత్రి ప్రసంగం ప్రారంభించడంతో అభిమానుల కేరింతలతో ఆ ప్రాంతం మార్మోగింది. పోయే కాలం వచ్చినప్పుడు విలన్‌లందరికి హీరో బచ్చాగాడిలా కనిపిస్తాడు... అయ్యా చంద్రబాబు.. నువ్వు బచ్చా అంటున్నా నేను ఇంటింటికి మంచి చేసి ఎన్నికల్లో ఒంటరిగా ధైర్యంగా నిలబడి ఓటు అడుగుతున్నా నువ్వు బచ్చా అన్న ఈ జగన్ ఇంటింటికి మంచి చేసి ఒంటరిగా నిలబడి ధైర్యంగా అడుగుతా ఉన్నాడు. మరి 14 ఏళ్ల సీఎం అంటావు, మూడు సార్లు సీఎంగా చేశానంటావు, మరీ నీ పేరు చెబితే ఏ పేదవాడికైనా కూడా ఒక్కంటంటే మంచి గుర్తుకు వస్తుందా అని ప్రశ్నించినప్పుడు జనం నుంచి మంచి స్పందన లభించింది.

హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రికి ఘనస్వాగతం లభించింది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరి, గుంటూరు తూర్పు అభ్యర్థి షేక్ నూరిఫాతిమాలతోపాటు గుంటూరు డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, పలు కార్పొరేషన్ల చైర్మన్‌లు సీఎంకు స్వాగతం పలికినవారిలో ఉన్నారు.

నిరంతరం మోసం చేసే వ్యక్తి చంద్రబాబు

వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ పెత్తందార్లకు, పేదలకు జరిగే యుద్ధంలో ప్రజలంతా పేదల పక్షమైన వైఎస్సార్ సీపీ వైపే ఉన్నారని అన్నారు. చంద్రబాబు తన 14 ఏళ్ల పాలనలో ఏ రోజైనా సామాన్య ప్రజలకు మంచి చేశాడా అని మండిపడ్డారు. పెత్తందార్లకు మేలు చేయడమే తప్ప పేద ప్రజలకు మంచి చేసిన చరిత్ర చంద్రబాబుకు లేదన్నారు. ప్రజలను నిరంతరం మోసం చేసే వ్యక్తి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. గల్లా జయదేవ్ 10 ఏళ్లు ఎంపీగా ఉన్నా ప్రజలెవరికీ కనిపించని నేతగా చరిత్రకెక్కాడని అన్నారు. ఇప్పుడు మళ్లీ డబ్బుల మూటతో వచ్చిన అమెరికా నేత పెమ్మసానిని తెచ్చి ప్రజల్ని మోసగించేందుకు చంద్రబాబు సిద్ధమయ్యాడని దుయ్యబట్టారు. డబ్బుందన్న అహంకారంతో ఉన్న పెమ్మసానికి గుంటూరు మిర్చిదెబ్బ చూపిస్తానని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాది సీఎం వైఎస్ జగన్ వేస్తున్నారని అన్నారు. పేదరికం నిర్మూలన జరిగేంత వరకు జగన్ ముఖ్యమంత్రిగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. సీఎం జగన్ ప్రవేశపెట్టిన మేనిఫెస్టో జనరంజకంగా ఉందని అన్నారు.

– కిలారి వెంకట రోశయ్య

పొన్నూరులో గెలుపు తథ్యం

వైఎస్సార్ సీపీ పొన్నూరు అసెంబ్లీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆర్థికాభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. పొన్నూరు నియోజకవర్గంలో అవినీతి లేని పాలన అందిస్తానని తెలిపారు. కాపు సామాజిక వర్గం అత్యధికంగా ఉన్న పొన్నూరులో తన గెలుపు తథ్యమని అన్నారు. వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి రాగానే ధూళిపాళ్ల నరేంద్ర జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. నరేంద్ర అవగాహన లేని రాజకీయాలు చేస్తున్నాడని విమర్శించారు. వచ్చే ఎన్నికలలో ఎంపీ అభ్యర్థి రోశయ్యను, తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

– అంబటి మురళీకృష్ణ



సీఎం వైఎస్ జగన్‌ను ఫొటో తీసుకుంటున్న యువకులు



సభ వద్ద జయహో జగన్ అంటూ మహిళల నినాదాలు



అంబటి ప్లకార్డులను చూపుతున్న చిన్నారులు



175 కి 175 సిద్ధమంటూ చేతులెత్తి జైకొడుతున్న జనసందోహం



అంబటి ప్లకార్డుతో ఓ వృద్ధురాలు

క్లుప్తంగా

పోటీలో 122మంది అభ్యర్థులు

పార్లమెంటుకు 15మంది, ఏడు అసెంబ్లీలకు 107మంది సిద్ధం

నరసరావుపేట : సార్వత్రిక ఎన్నికల్లో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తయ్యే సరికి జిల్లా వ్యాప్తంగా పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలకు 122మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. పార్లమెంటుకు 15మంది అభ్యర్థులు, ఏడు అసెంబ్లీలకు 107మంది అభ్యర్థులు రంగంలో నిలిచారన్నారు. పార్లమెంటుకు పోటీచేస్తున్న 15మందిలో గుర్తింపు పొందిన ప్రధాన పార్టీలకు చెందిన నలుగురు వ్యక్తులు బరిలో ఉన్నారన్నారు. పోటీలో ఉన్నవారందరికి గుర్తులు కేటాయించామన్నారు. సమావేశంలో జిల్లా ఎస్పీ బిందుమాధవ్ పాల్గొన్నారు.

బీసీల సంక్షేమానికి పాటుపడుతున్న జగన్



క్రోసూరు: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తరువాత రాష్ట్ర చరిత్రలో ఇప్పటి వరకు బీసీల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి, వారి అభివృద్ధికి కృషి చేసిన ఏకైక నాయకుడు సీఎం వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి మాత్రమేనని రాష్ట్ర బీసీ కులాల జేఏసీ అధ్యక్షుడు అంగిరేకుల ఆదిశేషు యాదవ్ అన్నారు. బీసీలకు సీఎం జగన్ ఇచ్చిన ప్రాధాన్యత పై ఏ పార్టీ, ఏ నాయకుడితోనైనా బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. సోమవారం క్రోసూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అధ్యక్షతన రాష్ట్ర బీసీ సంఘాల నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆదిశేషు మాట్లాడుతూ బీసీలంతా స్వార్థ రాజకీయాలు వీడి జగన్‌మోహన్‌రెడ్డికి, ఆయన తరఫున ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు ఏకపక్షంగా మద్దతివ్వాలని కోరారు.





ప్రచార పర్వం

పల్నాడు జిల్లాలో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల ప్రచారం ఊపందుకుంది. సోమవారం మాచర్ల, సత్తెనపల్లి, గురజాల నియోజకవర్గాలలో అభ్యర్థులు ప్రచారం నిర్వహించారు. మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. వెల్దుర్తి మండలం శిరిగిరిపాడులో ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డిలు ప్రచారం నిర్వహించారు. సత్తెనపల్లి నియోజకవర్గం నకరికల్లు మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి రాంబాబు ప్రచారం నిర్వహించారు. దాచేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. స్థానికులు సాదరంగా ఆహ్వానించి మద్దతు పలికారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల విస్తృత ప్రచారం

- ఆరో వార్డులో పర్యటించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- నాల్గవ వార్డులో పర్యటించిన డాక్టర్ గోపిరెడ్డి సుస్మితారెడ్డి



ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డికి శాలువా కప్పుతున్న సీనియర్ నాయకులు అచ్యుతరావు

నరసరావుపేట: పట్టణంలో వైఎస్సార్‌సీపీ పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులు డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ పలువురు నాయకులు సోమవారం పట్టణంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. నాలుగో వార్డులో డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి సతీమణి డాక్టర్ గోపిరెడ్డి సుస్మిత ప్రతి గడపకి వెళ్లి జగనన్న చేసిన సంక్షేమం అభివృద్ధి గురించి వివరిస్తూ రానున్న రోజుల్లో జగనన్న ప్రభుత్వం మళ్లీ తిరిగి అధికారంలోకి రావాలంటే పార్టీని గెలిపించుకోవాలని కోరారు. ఏపీఐఐసీ డైరెక్టర్, రాష్ట్ర కార్యదర్శి కాకుమాను సదాశివరెడ్డి, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఖాదర్ భాషా, నాలుగో వార్డు ఇంచార్జ్ షేక్ జానీభాష, జిల్లా మైనార్టీ సెల్ కార్యదర్శి సయ్యద్ ఖాదర్‌బాషా, వార్డు ప్రెసిడెంట్ మౌలాలి, నాయకులు లడ్డుభాష, మహిళా నాయకులు, అభిమానులు పాల్గొన్నారు. ఆదివారం రాత్రి ఆరో వార్డులో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి సీనియర్ నాయకులు, రిటైర్డు డెప్యూటీ కలెక్టర్ జి.అచ్యుతరావు ఆధ్వర్యంలో వార్డు ప్రజలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో డాక్టర్ మేకల చంద్రకిరణ్‌రెడ్డి, మైలేరీ మార్కు, గుంటి ప్రశాంత్, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి సాధ్యం

- మీ కుటుంబంలో ప్రభుత్వ పథకాలు అందితేనే ఓటు వేయండి
- భవిష్యత్ బాగుండాలంటే వైఎస్సార్‌సీపీని గెలిపించండి
- మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



ఎన్నికల ప్రచారంలో పాల్గొని అభివాదం చేస్తున్న మాజీ మంత్రి అనిల్‌కుమార్, ప్రభుత్వ విప్ పీఆర్కే

వెల్దుర్తి: ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి సాధించాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ద్వారానే సాధ్యమవుతుందని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నర్సరావుపేట పార్లమెంట్ అభ్యర్థి పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. శిరిగిరిపాడులో మాజీ మంత్రి అనిల్‌కుమార్, ప్రభుత్వ విప్ పీఆర్కేలకు గులాబీ గజమాలతో ఘన స్వాగతం పలికారు. సోమవారం మండలంలోని శిరిగిరిపాడు, మిట్టమీదిపల్లె, లోయపల్లి, గంగలకుంట, గొట్టిపాళ్ళ గ్రామంలో జరిగిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం సీఎం జగన్ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. మీ కుటుంబాల్లో ప్రభుత్వ పథకాలందితేనే ఓటు వేయమని చెప్పిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డేనన్నారు. ఏ ఒక్క నాయకుడూ అభివృద్ధిని చూసి ఓటు వేయమని చెప్పే వారే లేరన్నారు. చేయగలిగిన పనులే చెబుతామని, అలివిగాని హామీలిచ్చి మేనిఫెస్టోలోను వెబ్ సైట్ల నుంచి తొలగించే పద్ధతి వైఎస్సార్‌సీపీకి లేదన్నారు. మాజీ సీఎం చంద్రబాబు 2014 ఎన్నికలకు ముందు 600 హామీలిచ్చి ఏ ఒక్క పథకాన్ని పూర్తి చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. మళ్ళీ మూడు పార్టీలు కూటమిగా ఏర్పడి ప్రజలను మరోసారి మోసం చేసేందుకు జట్టుకట్టి ప్రజల వద్దకు వస్తున్నారని, వారికి తగిన బుద్ధి చెప్పాల్సిన సమయం వచ్చిందన్నారు. ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేసి అత్యధిక మెజారిటీ తీసుకురావాల్సిన బాధ్యత మీ పై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాచర్ల మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, మాజీ చైర్మన్ పల్లపాటి గురుబ్రహ్మం, మండల పరిషత్ అధ్యక్షుడు అలుగుమల్లి సంజీవరెడ్డి, పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఉపాధ్యక్షుడు దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు భూమిరెడ్డి రామాంజిరెడ్డి, చపారపు లచ్చిరెడ్డి, ఈగల అయ్యన్న, వజ్రాల మల్లయ్య, బొజ్జా అంజిబాబు, బలిగొడుగుల శ్రీనివాసరావు, అంకిరెడ్డి, సబ్బసాని కోటిరెడ్డి, గోళ్ళ యర్రబ్బాయి, కాయకోకుల రామాంజనేయులు, రవీంద్రానాయక్, మోరబోయిన అచ్చయ్య, పోలకాని వెంకటనారాయణ, మాచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్‌లు తురక కిషోర్, బత్తుల ఏడుకొండలు, మేడబోయిన కృష్ణ, కోటయ్య, శ్రీనునాయక్, సర్దార్ నాయక్, లక్ష్మానాయక్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

తేలిన తుది అభ్యర్థుల జాబితా

- ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ గడువు
- జిల్లాలో 14 మంది స్వతంత్ర అభ్యర్థులు విత్ డ్రా
- పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా విడుదల చేసిన ఎన్నికల అధికారులు
- పార్లమెంట్‌కు 15 మంది, అసెంబ్లీ స్థానాల్లో 107 మంది
- అభ్యర్థులకు గుర్తులు కేటాయింపు

నామినేషన్ల ఉపసంహరణ తరువాత బరిలో నిలిచిన అభ్యర్థుల సంఖ్య నియోజకవర్గాల వారీగా

నియోజకవర్గం	దాఖలైన నామినేషన్లు	తిరస్కరణ	ఉపసంహరణ	తుది పోరులో
నరసరావుపేట (పార్లమెంట్)	27	8	4	15
పెదకూరపాడు	26	15	0	11
చిలకలూరిపేట	33	7	1	25
నరసరావుపేట	25	9	2	14
సత్తెనపల్లి	22	2	5	15
వినుకొండ	24	8	2	14
గురజాల	25	12	0	13
మాచర్ల	24	9	0	15
మొత్తం	206	70	14	122

సాక్షి, నరసరావుపేట: సార్వత్రిక ఎన్నికల్లో కీలకమైన నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం సోమవారం ముగిసింది. జిల్లాలో నరసరావుపేట పార్లమెంట్, ఏడు అసెంబ్లీ స్థానాలలో ఎన్నికల బరిలో నిలిచే తుది అభ్యర్థుల జాబితాను జిల్లా ఎన్నికల అధికారులు ప్రకటించారు. పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తులను సైతం కేటాయించారు. నరసరావుపేట పార్లమెంట్ స్థానానికి మొత్తం 27 నామినేషన్లు దాఖలవ్వగా అందులో 8 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. మిగిలిన 19 మందిలో సోమవారం ఉపసంహరణ గడువు ముగిసేలోగా నలుగురు అభ్యర్థులు బరి నుంచి తప్పుకున్నారు. దీంతో ప్రస్తుతం 15 మంది తుదిపోటీలో నిలిచారు. ఇందులో జాతీయ, రాష్ట్ర స్థాయి గుర్తింపు ఉన్న పార్టీల నుంచి ఇద్దరేసి చొప్పున బరిలో ఉన్నారు. ఇందులో మరో ఎనిమిది మంది రిజిస్టర్ అయిన రాజకీయపార్టీల తరపున, ఐదుమంది స్వతంత్రులుగా బరిలో నిలిచారు. వీరందరికీ పార్లమెంట్ ఆర్వో ఎన్నికల గుర్తులను కేటాయించారు.

అసెంబ్లీ స్థానాల్లో 107 మంది : పల్నాడు జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో కలిపి మొత్తం 179 మంది నామినేషన్లు స్వీకరించారు. ఇందులో 62 నామినేషన్లు పరిశీలనలో తిరస్కరణకు గురికాగా 117 నామినేషన్లు ఆమోదం పొందాయి. ఇందులో 10 మంది తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో మొత్తం 107 మంది తుది పోరులో నిలిచారు. అత్యధికంగా చిలకలూరిపేటలో 25 మంది పోటీలో నిలిచారు. ఇక్కడ 15 మంది కన్నా ఎక్కువ మంది అభ్యర్థులు బరిలో ఉండటంతో రెండు ఈవీఎం బ్యాలెట్ యూనిట్లు వినియోగించనున్నారు. అత్యల్పంగా పెదకూరపాడులో 11 మంది పోటీలో ఉన్నారు. జిల్లాలో అన్ని స్థానాల్లో ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన వైఎస్సార్‌సీపీ, బీఎస్పీ, టీడీపీ, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు తుదిపోరులో ఉన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుమ్మడి కోటేశ్వరరావు మాచర్ల అసెంబ్లీ స్థానంలో కూటమి రెబల్‌గా స్వతంత్ర అభ్యర్థిగా నిలిచారు. పోటీలో నిలిచిన అభ్యర్థులకు ఆయా ఆర్వోలు ఎన్నికల గుర్తులను కేటాయించారు.

అభ్యర్థులు ఎన్నికల నియమావళి పాటించాలి

జిల్లా ఎన్నికల అధికారి శివశంకర్



నరసరావుపేట: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో నామినేషన్ల ఉపసంహరణ పూర్తయిందని, ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు నియమావళిని విధిగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివశంకర్ లోతేటి కోరారు. సోమవారం సాయంత్రం ఎన్నికల పరిశీలకులు సుమీత్ కుమార్, జార్జ్ జోసేఫ్, గౌతామన్, భురే సర్వేశ్వర నరేంద్ర , శ్రీహరి ప్రతాప్ షాహీ, పోలీస్ పరిశీలకులు అజిత్ సింగ్ సమక్షంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ మాట్లాడుతూ క్రిమినల్ కేసులు ఉన్న వారిని పోలింగ్ ఏజెంట్లుగా ఉంచరాదన్నారు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్, పోలీస్ శాఖ శాంతిభద్రతలు, సిబ్బంది నియామకంపై వివరించారు. జిల్లా పంచాయతీ అధికారి ఎం.వీ. భాస్కరరెడ్డి, యస్.ఐ.సి అధికారి జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

గిరిజన పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

నరసరావుపేట ఈస్ట్ : పట్టణంలోని రెడ్డినగర్‌లో ఉన్న గిరిజన బాలుర సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ గుమ్మడి వీరయ్య సోమవారం తెలిపారు. 6వ తరగతిలో 20, 7వతరగతిలో 14, 8వతరగతిలో 9, తొమ్మిదో తరగతిలో 12 ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల గిరిజన విద్యార్థులు మే నెల 20లోపు తమ దరఖాస్తులను పాఠశాలలో అందించాలని కోరారు. వివరాలకు 6301318855, 9177846313 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఇంటింటికీ పింఛన్లు పంపిణీ చేస్తాం



జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్

నరసరావుపేట: ప్రభుత్వం ప్రతి నెలా పంపిణీ చేస్తున్న సామాజిక భద్రత పింఛన్లను మే, జూన్ నెలలో డీబీటీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్)తో పాటు, ఇంటింటికి పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టరు లోతేటి శివశంకర్ తెలిపారు. దీనికి సంబంధించి కలెక్టర్ మీడియాకు వివరాలు తెలిపారు. రానున్న మే, జూన్ నెలలో సామాజిక భద్రత కొరకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పింఛన్లు డీబీటీ విధానంతో పాటు, నిస్సహాయ స్థితిలో ఉన్న వారికి ఇంటింటికీ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో మొత్తం 2,81,235 పింఛన్ లబ్ధిదారులకు గాను మొత్తం రూ.84,01,36,500 పంపిణీ చేయాల్సి ఉందన్నారు. అందులో 2,10,007 మందికి నేరుగా లబ్ది దారుల బ్యాంకు ఖాతాల్లో ఫింఛన్ సొమ్ము మొత్తం రూ.63,01,35,000 జమ చేయడం జరుగుతుందన్నారు. మిగిలిన 71,228 మందిలో దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, వివిధ ఆరోగ్య కారణాలతో మంచానికే పరిమితమైన వారు, వీల్‌చైర్స్‌లో ఉన్నవారు, సైనిక పింఛన్, వితంతువులకు మొత్తం రూ.21,00,01,500 ఇంటి వద్దనే పింఛన్ సొమ్ము అందచేయడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులు ఎవరూ పింఛన్ కోసం గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. ఎవరికి ఏ విధంగా పింఛన్ పంపిణీ చేయాలనే అంశంపై గ్రామ, వార్డు సచివాలయాలకు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని వివరించారు.

డీల్ కుదిరింది..?

- నామినేషన్ ఉపసంహరించుకున్న స్వతంత్ర అభ్యర్థి వెంకట అప్పారావు
- కన్నాకు టికెట్ ఇవ్వడంతో జనసేనకి రాజీనామా చేసి రెబల్ గా బరిలో
- పెద్దస్థాయిలో నగదు చేతులు మారిందంటున్న జనసేన అభిమానులు

సాక్షి, నరసరావుపేట: అందరూ అనుకున్నదే అయ్యింది. టీడీపీ అభ్యర్థి కన్నాపై రెబల్‌గా సత్తెనపల్లి అసెంబ్లీ స్థానం నుంచి బరిలో నిలిచిన బొర్రా వెంకటఅప్పారావు సోమవారం తన నామినేషన్ ఉపసంహరించుకున్నారు. సత్తెనపల్లి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ, గురజాల టీడీపీ అభ్యర్థి యరపతినేని శ్రీనివాసులు వెంట రాగా సత్తెనపల్లి ఆర్వో కార్యాలయంలో అప్పారావు తన నామినేషన్ విత్‌డ్రా చేసుకున్నారు. బొర్రా వెంకటఅప్పారావు సత్తెనపల్లి జనసేన పార్టీ ఇంచార్జిగా ఉంటూ కూటమి తరపున ఎమ్మెల్యేగా పోటీ చేయాలని భావించారు. అయితే టీడీపీ ఈ స్థానంలో మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణను అభ్యర్థిగా ప్రకటించింది. కన్నా తనకు కనీస ప్రాధాన్యత ఇవ్వలేదన్న ఉక్రోషంతో రెబల్ అభ్యర్థిగా దిగి ఓడిస్తానని బొర్రా అప్పారావు ప్రకటించారు. జనసేన ప్రాథమిక సభ్యత్వం , నియోజకవర్గ ఇన్‌చార్జి పదవులకు బొర్రా రాజీనామా చేశాడు. నామినేషన్ వేసి జోరుగా ప్రచారం చేశాడు. అయితే గత మూడు, నాలుగు రోజులుగా సత్తెనపల్లిలో ఓ ప్రచారం వినిపించింది. కన్నాతో ప్యాకేజీ కోసమే ఈ హంగామా చేస్తున్నారని, రూ.8 కోట్ల దాకా డిమాండ్ చేశారన్న వార్తలు వినిపించాయి. సోమవారం మాత్రం బొర్రా తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు.

కన్నాకు ఊడిగం చేయలేం : నామినేషన్ ఉపసంహరణ తరువాత బొర్రా మీడియాతో మాట్లాడుతూ కన్నా లక్ష్మీనారాయణ పల్లకి మోస్తానని చెప్పడం పట్ల ఆయన వెంట నడిచిన జనసేన కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిన్నటి వరకు వావిలాల స్ఫూర్తి, ఎన్టీఆర్ ఆత్మగౌరవం వంటి పెద్ద పెద్ద పదాలు వాడిన అప్పారావు ఒక్కసారిగా ఇలా ఊడిగం చేయడానికి తెర వెనుక ఏం జరిగిందని ప్రశ్నిస్తున్నారు.

వివాహేతర సంబంధంతో భర్తను హత్య చేసిన భార్య

సత్తెనపల్లి డీఎస్పీ గురునాథ్ బాబు

సత్తెనపల్లి: వివాహేతర సంబంధంతో భర్తను భార్య, ప్రియుడు, అత్త, మరో ఇద్దరు కలిసి పథకం ప్రకారం హతమార్చిన సంఘటన పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం మొక్కపాడు గ్రామంలో ఆలస్యంగా వెలుగు చూసింది. సత్తెనపల్లి డీఎస్పీ గురునాథ్ బాబు సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రాజుపాలెం పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వీఆర్వో ఇచ్చిన రిపోర్టుపై మిస్సింగ్ కేసును ఈ ఏడాది ఏప్రిల్ 28న హత్య కేసుగా మార్చి కేసును విచారించే బాధ్యలను సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ సీఐ ఎం.రాజేష్‌కుమార్‌కు అప్పగించారు. మృతుడి భార్య పశ్యావుల త్రివేణితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. దీంతో భర్తను అడ్డుతొలగించుకునేందుకు 2023 డిసెంబర్ 27న తన ప్రియుడైన మాదాసు వెంకటరావు, మృతుడి భార్య త్రివేణిలతో పాటు మృతుడి అత్త అయిన దేవరంపాడుకు చెందిన పులిబండ్ల ఆదిలక్ష్మీలు కలిసి రెడ్డిగూడెం- మొక్కపాడు గ్రామాల మధ్య బ్రాహ్మణపల్లి వాగు చప్టా వద్ద విజయ నరసింహరావు గొంతు నులిమి హత్య చేసి పక్కనే ఉన్న వాగులో గల ముళ్ళకంపలో పడేశారు. 2023 డిసెంబర్ 28న రాత్రి మాదాసు వెంకట్రావు, దుగ్గినేని వెంకట్రావు పెట్రోల్ తీసుకొని వచ్చి మృతుడి శవం పై పోసి తగులు పెట్టారు. ఈ హత్య కేసులో నిందితులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.రాజేష్‌కుమార్, రాజుపాలెం ఎస్ఐ షమ్మీర్‌బాషా ఉన్నారు.

మీ భవిష్యత్తే జగనన్న లక్ష్యం

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : జగనన్న ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలని గురజాల అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని కేసానుపల్లి, తక్కెళ్లపాడు, పెదగార్లపాడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రచారంలో ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలన్నదే జగనన్న ధ్యేయమని, ప్రజలంతా నిండు మనస్సుతో జగనన్నని మరోసారి ఆశీర్వాదించి సీఎం పీఠంపై కుర్చొబెట్టాలని కోరారు. తనను గెలిపిస్తే సంవత్సరానికి ఒక గ్యాస్ సిలిండర్ ఇస్తానని టీడీపీ అభ్యర్థి యరపతినేని చెబుతున్నాడని, అంటే రోజుకి రూ50పైసలు ఇస్తాడంట..అక్క చెల్లెమ్మల్లరా నేను మిమ్మల్ని అడుగుతున్నా..మీకు యరపతినేని ఇచ్చే గ్యాస్ సిలిండర్ కావాలా..జగనన్న ఇచ్చే మంచినీళ్లు కావాలా అని ప్రజలను ఎమ్మెల్యే కాసు అడిగితే మాకు గ్యాస్ సిలిండర్ వద్దు..మంచినీళ్లే కావాలని సమాధానం చెప్పారు. పల్లకి మోసిన బలహీనవర్గాలను టీడీపీ అణగదొక్కిందని ఎమ్మెల్యే కాసు అన్నారు. జగనన్న ప్రభుత్వంలో ఓసీలకు రిజర్వేషన్ వచ్చిన చోట కూడా ఎస్సీలకు పదవులు ఇచ్చామని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలను సామాజికంగా, ఆర్థికంగా బలోపేతం చేశామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమాల్లో డాక్టర్ చింతలపూడి ఆశోక్‌కుమార్, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభానీ, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీలు కందుల జాను, కటకం జయశ్రీ, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, సర్పంచ్‌లు వినుకొండ కోటేశ్వరరావు, కర్పూరపు వెంకటకోటయ్య, ఎంపీటీసీలు చెట్టిపాగు ఏసుదాసు, జంగిలి నరసింహరావు, మోమిన్ నాగుల్‌మీరా, నాయకులు బొల్లా శ్రీనివాసరావు, నెల్లూరి రామారావు, చుండు రామారావు, కర్నాటి గాంధీ, జక్కుల వీరాస్వామి, ఉల్లేరు హనుమంతరావు, జక్కుల బుల్లెబ్బాయి, మేడతి నరసింహరావు, గుదూరి గోవర్ధన్‌రావు, రాచకొండ కోటయ్య, లింగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ముత్యం చెన్నారెడ్డి పాల్గొన్నారు.